ప్రయాణం సాఫీగా..

- పూర్తయిన ఇంజాపూర్–తొర్రూర్ రోడ్డు నిర్మాణ పనులు
- దాదాపు 30 ఏళ్లు కొనసాగిన భూసేకరణ వివాదం
- రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఇంజాపూర్–తొర్రూర్ రోడ్డు

తుర్కయంజాల్: ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే రోడ్డు గత కొన్నేళ్లుగా గుంతలమయంగా మారడంతో పాటు కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా.. ఇక్కడ స్థానికంగా నెలకొన్న వివాదం కారణంగా 300 మీటర్ల మేర రోడ్డు వెడల్పు పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ విషయాన్ని స్థానిక నేతలు ఇటీవల ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రత్యేక చొరవతో సమస్యను పరిష్కరించడంతో పాటు సంబంధిత రోడ్డును త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పనులను పూర్తిచేశారు.


30 ఏళ్లుగా వివాదం

ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే రోడ్డు వివాదం 30 ఏళ్లుగా కొనసాగుతోంది. ఇదే గ్రామానికి చెందిన బొక్క గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన సర్వే నంబర్ 87, పిట్టా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెందిన 110, 111 సర్వే నంబర్‌ల బార్డర్ నుంచి వెళ్లే రోడ్డు ఇరువురు రైతుల మధ్య ఏళ్ల తరబడి వివాదానికి కారణమైంది. ఈ వివాదంపై ఇరువర్గాల వారు కోర్టులను ఆశ్రయించారు. గతంలో చివరిసారిగా 2002లో సింగిల్ లైన్ రోడ్డు వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ తర్వాత ఎన్నోసార్లు, అసంపూర్తిగా మిగిలి ఉన్న రోడ్డు పనులను పూర్తిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణయించినా గొడవకు దారితీస్తుండటంతో పరిష్కారానికి నోచుకోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంజాపూర్ నుంచి బ్రాహ్మణపల్లి మీదుగా, రాగన్నగూడలోని సాగర్ రహదారి వరకు రెండు లేన్లుగా రోడ్డు విస్తరణ పనులను చేపట్టినప్పటికి ఈ వివాదం కొనసాగుతుండటంతో ఇక్కడ రోడ్డును అలానే వదిలేశారు.

ప్రమాదకరంగా రోడ్డు

ఏళ్ల క్రితం వేసిన రోడ్డు గుంతలమయంగా మారడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి ఉండేది. ఇంజాపూర్ నుంచి తొర్రూర్, కొహెడ, బ్రాహ్మణపల్లి, మునగనూర్‌కు వెళ్లే వారు ఇతర మార్గాలను ఎంచుకునే వారు. దీంతో దూరభారం పెరిగేది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించడంతో పాటు రోడ్డు పనులను పూర్తి చేయించారు.

రైతులకు కృతజ్ఞతలు



ఇంజాపూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే రోడ్డు వెడల్పు పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను పలుమార్లు స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని పరిష్కరించాలని అనుకున్నాను. అందులో భాగంగానే సంబంధిత రైతులతో చర్చించాను. అనంతరం రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయించాం. సహకరించిన రైతులకు కృతజ్ఞతలు.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ విష్ణు వర్ధన్‌రెడ్డి

సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆరుట్ల అనుబంధ గ్రామం బుగ్గతండాలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతీయువకులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలన్నారు. క్రీడలు ఆడటం వలన శరీర ఎదుగుదలతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడోత్సవాలు యువకుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆణిముత్యాలను వెలికితీయడమే గాకుండా అన్ని రకాలుగా తమ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, నాయకులు చంద్రయ్య, సురేష్, రాము, జానీపాషా, ఐలయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు వెంకటేష్, వినోద్, ప్రవీణ్, మోహన్, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానంతోనే సమాజంలో మార్పు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: జ్ఞాన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జ్ఞాన ప్రచార సభ కల్వకుర్తి నియోజకవర్గ కార్యనిర్వాహకుడు జంతుక శంకర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జ్ఞాన ప్రచార సభ ఆధ్వర్యంలో జ్ఞాన వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జంతుక శంకర్ మాట్లాడుతూ.. జ్ఞానంద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలుగుతామని అన్నారు. జ్ఞాన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు తమవంతు పాత్ర నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన ప్రచారసభ నాయకులు నాగిళ్ల ఆనంద్, జంతుక బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నందివనపర్తి ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ విద్యార్థులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం చౌదర్‌పల్లి గేట్ వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అంతా ఒక్కచోట చేరి పాఠశాలలో గడిపిన చేష్టలను గుర్తు చేసుకున్నారు. నందివనపర్తి ఉన్నత పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల మెరుగైన చదువుల కోసం, తోటి స్నేహితుల్లో పేదలకు ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. అనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్నవారు వెంటనే 100 డయల్ చేయాలని ఆదిబట్ల నూతన సీఐ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల సీఐగా పని చేసిన రఘువీర్‌రెడ్డి కుషాయిగూడ ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా రాఘవేందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా విచ్చేసిన సీఐ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులంటే ప్రజలకు భయం అవసరం లేదన్నారు. నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నిరంతరం బాధితుల పక్షాన నిలుస్తామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షించడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని సూచించారు. పైరవీలకు తావులేదని చెప్పారు. భూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. నేరాలు అదుపు చేయడానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు ప్రాధాన్యత ఉందన్నారు. బహుళజాతి కంపెనీలు ఉన్నందున పటిష్టమైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, సాగర్ రహదారిపై భద్రతా చర్యలు చేపడతమన్నారు.

ద్వారకామయి పీఠాన్ని సందర్శించిన మాజీ డీజీపీ



పీఠాధిపతితో గిరీష్‌కుమార్

మీర్‌పేట: ప్రశాంతిహిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఆర్.ఆర్. గిరీష్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి గోపాలకృష్ణానంద.. గిరీష్‌కుమార్‌ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐక్యతకు క్రీడలు దోహదం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అఫ్జల్, నిర్వాహకులు

కౌన్సిలర్ అఫ్జల్

పహాడీషరీఫ్: యువతలో ఐక్యతకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని జల్‌పల్లి మున్సిపాలిటీ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమిదా అఫ్జల్ అన్నారు. వాదే ముస్తఫా ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఆదివారం ముగిసింది. టోర్నమెంట్ విజేతగా పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి టీం (పీకేఆర్) నిలవగా, రన్నరప్‌గా వాదే ముస్తఫా క్రికెట్ క్లబ్ నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి, ట్రోఫీ, రన్నర్‌కు రూ.5 వేల నగదును కౌన్సిలర్ అందజేశారు. ఈ సందర్భంగా ఫమిదా అఫ్జల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది యువతను ఏకతాటిపైకి తెచ్చేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మతీన్ పటేల్, సయ్యద్ హుస్సేన్, ఇద్రీస్, ఫైసల్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యే పర్యటన

మాడ్గుల: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త బ్రాహ్మణపల్లి, నల్లవారిపల్లి, గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవంతో పాటు పాత బ్రాహ్మణపల్లి నుంచి ఆర్కపల్లి వెళ్లే రహదారిలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, పాత బ్రాహ్మణపల్లిలో వైకుంఠధామాన్ని ఆయన ప్రారంభిస్తారన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో కల్యాలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకాగలరని ఆయన కోరారు.

హయత్‌నగర్ సీఐ బదిలీ



వెంకటేశ్వర్లు

హయత్‌నగర్: హయత్‌నగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ హెచ్.వెంకటేశ్వర్లు మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ కమిషనర్ ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేయగా.. ఆదివారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయనతో పాటు ఇక్కడ డీఐగా పనిచేసిన ఆర్.నిరంజన్ కూడా ట్రాన్స్‌ఫర్ చేశారు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరూ ఒకేసారి బదిలీ అయినా అధికారులు ఇక్కడ బాధ్యతలు ఎవ్వరికీ ఇవ్వకపోవడం గమనార్హం. ఇక్కడ ఎస్‌హెచ్‌ఓ బాధ్యతలు ఎవరికి ఇస్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పార్కులను కాపాడుకుందాం: ఎమ్మెల్యే

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణ కోసం పార్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, పార్కుల చుట్టూ ప్రహరీ నిర్మించి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హస్తినాపురం డివిజన్ హుడా భారతీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్కుల్లో వ్యర్థాలు పడేయకుండా చూడాలని, రాత్రి వేళల్లో పార్కుల్లో ఆకతాయిలు వచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. కాలనీల్లోని పార్కులను సంరక్షించి వాటిలో ప్రజలకు ఉపయోగపడేలా వాక్ ట్రాక్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. దేశంలోనే అత్యధికంగా పార్కులు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఉన్నాయని, పార్కులను అందంగా తీర్చిదిద్దుతానని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యం చారి, నాయకులు గోదల రఘుమా రెడ్డి, నల్ల నాగిరెడ్డి, రమావత్ శ్రీనివాస్‌నాయక్, కంచర్ల శివారెడ్డి, సయ్యద్ పాషా, హుడా భారతీనగర్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తీరు మారేనా?

- సిబ్బంది లేక మూతపడిన పశువైద్యశాల
- మూగజీవాలకు అందని వైద్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- కొత్త ప్రభుత్వం వైపు పాడిపోషకుల ఎదురుచూపులు



మూతపడిన చనువెళ్ల పశువైద్యశాల సబ్‌సెంటర్

చేవెళ్ల: దాదాపు ఎనిమిదేళ్లుగా పశువైద్యశాఖలో ఖాళీపోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో పశువైద్యశాలలు(సబ్ సెంటర్లు) మూత పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. చేవెళ్ల మండలంలోని పశువైద్యానికి సిబ్బంది కొరత ఉండడంతో మండలంలోని ఏడు సబ్‌సెంటర్లు ఎనిమిదేళ్లుగా మూసేశారు. నేడు ఈ భవనాలు శిథిలావస్థలో చేరాయి. గ్రామాల్లోని పశువులకు సకాంలో వైద్యం అందకపోవడంతో అవి మృత్యువాత పడుతున్నాయి. దీంతో గత్యంతరం లేక వాటిని అమ్ముకుంటున్నారు. గతంతో పోలిస్తే మండలంలో భారీగా పశుపోషణ తగ్గింది. ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలోనైనా పశువైద్యం గాడిన పడుతుందో లేదోనని వారు ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాడిపరిశ్రమ పెంపకానికి ఆసక్తి చూపించింది. దీంతో గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలను కూడా చేపట్టారు. ఈ క్రమంలోనే పశువైద్యానికి సహకారం ఇస్తారని ఎదురుచూసిన రైతుల ఆశలు ఆడియాశలయ్యాయి. ఈ మండలాల్లో పశువైద్యానికి సహకారమే లేదు. దీంతో వాటి నిర్వహణకు చర్యలు చేపట్టకపోవడంతో ఏనిమిదేళ్లుగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో అవీ ఒక్కొక్కటిగా మూతపడుతూ వచ్చాయి. చేవెళ్ల మండలంలో 37 పంచాయతీల్లో ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్నారు. చాలామంది ప్రజలు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను పోషించుకుంటూ వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీటికి ఏదైన రోగం వస్తే వైద్యం అందించేందుకు అందుబాటులో వైద్యులు, సిబ్బంది ఎక్కువగా లేరు. దీంతో పశువులకు ఎదైనా అనారోగ్య సమస్య వస్తే గ్రామాల్లోనే తెలిసిన వైద్యం చేసుకోవడం లేదా ఉన్న వాటిని అమ్ముకోవటం లాంటివి చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో స్పందించి మండలంలో పశువైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

మూతపడిన ఏడు సబ్‌సెంటర్లు

చేవెళ్ల మండలంలో ఆవులు 4,684, బర్రెలు 4,128, గొర్రెలు 22,894, మేకలు 7,835 ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం ఉన్న పశువులతో పోలిస్తే సగానికిపైగా పశువులు తగ్గిపోయాయి. మండలంలో పశువైద్యం అందించేందుకు ఆలూరు, పలుగుట్టలలో ప్రైమరీ వెటర్నీ సెంటర్లు, చేవెళ్లలో పశువైద్యశాల ఉన్నాయి. వీటితోపాటు మండలంలో ఏడు సబ్‌సెంటర్లు కొకుంట్ల, తంగడపల్లి, ఖానాపూర్, కమ్మెట, ముడిమ్యాల, చనువెళ్లి, గుండాల గ్రామాల్లో ఉన్నాయి. గతంలో ఈ సబ్‌సెంటర్లలో సిబ్బంది ఉండడంతో గ్రామాల్లో అవసరం ఉన్న చోట ఎక్కడికక్కడే వైద్యం అందించే వారు. ప్రస్తుతం మండలంలో ఏ సబ్‌సెంటర్లో కూడా ఒక్క సిబ్బంది కూడా లేకపోవడంతో ఏడు సబ్‌సెంటర్లు మూతపడ్డాయి. కేవలం చేవెళ్ల, ఆలూరు, పలుగుట్టలలోని ప్రైమరీ వెటర్నీ సెంటర్లలో ఒకరిద్దరితోనే పశువు వైద్యం అందుతుంది. వెంటనే అవసరమైన చోట వైద్య సిబ్బందిని నియమించాలని పశుపోషకులు కోరారు.

సిబ్బంది లేక ఇబ్బంది



పేరుకే పశువైద్యశాల ఉంది. కాని ఎప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ఎప్పుడు అడిగిన మరో గ్రామంలో ఉన్నారని చెబుతారు. పాడి పశువులకు సకాలంలో వైద్యం అందించే సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే వారు. కొన్నేళ్లుగా వైద్య సిబ్బంది గ్రామాలకు రావడం లేదు. కొత్త ప్రభుత్వంలోనైనా పశువైద్యం మెరుగుపడుతుందని ఆశిస్తున్నాం. గ్రామాల్లో ఉన్న సబ్‌సెంటర్లలో వైద్యులు, సిబ్బంది అందుబాటులోఉండేలా చూడాలి. మెరుగైన వైద్యం అందించాలి.

– వీరేశం, రైతు, కుమ్మెర

మూగజీవాలపై నిర్లక్ష్యం



మూగజీవాలు కాబట్టే వాటికి ఏదైనా వ్యాధి సోకితే చెప్పుకోలేవు. వాటి విషయంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలో పేరుకే పశువైద్యశాలలు ఉన్నట్లుగా కనిపిస్తున్నాయి. మండలకేంద్రంలో ఒక్కటే వైద్యశాల ఉండడంతో గ్రామాలనుంచి పశువులను ఇక్కడికి తీసుకురాలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా సబ్‌సెంటర్లలో వైద్యం అందుబాటులో ఉంటే బాగుంటుంది. మూగజీవాలపై నిర్లక్ష్యం తగదు.

– వెంకటేష్, రైతు, పామెన

సబ్‌సెంటర్లు మూతపడ్డాయి



మండలంలోని గ్రామాలకు సంబంధించి సరిపడ పశువైద్య సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారికి పనిభారం ఎక్కువవుతుంది. ఉన్న సిబ్బందితో ఎక్కడ పశువులకు సమస్య ఉందని తలిస్తే అక్కడికే వెళ్లి వైద్యం అందిస్తున్నాం. మండలంలోని ఏడు సబ్‌సెంటర్లలో సిబ్బంది లేక మూతపడి ఉన్నాయి. మోబైల్ పశువైద్య వాహనం ద్వారా కూడా నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో పశువైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తే అన్ని సబ్‌సెంటర్లు తెరుచుకుంటాయి. కొత్త ప్రభుత్వంలో పోస్టులు మంజూరు చేస్తారని ఆశిస్తున్నాం. సరిపడా సిబ్బంది ఉంటే సేవలు త్వరగా అందుతాయి.

– తిరుపతిరెడ్డి, పశువైద్యుడు, చేవెళ్ల

క్లుప్తంగా

నేడు అన్నాస్‌పల్లి జీపీ కార్యాలయం ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రామ సచివాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సచివాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఎమ్మార్పీఎస్ సదస్సు

కడ్తాల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరుగనున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో జరిగే సభకు జిల్లా నలుమూలల నుంచి సంఘం నాయకులు, విద్యావంతులు, మేధావులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. మాదిగ జాతి అభివృద్ధికై సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శ్రీలత

తుర్కయంజాల్: యంజాల్ మున్సిపాలిటీలోని ఉమర్‌ఖాన్ గూడ వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కౌన్సిలర్ కరాడి శ్రీలత తెలిపారు. రూ.23 లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. నాయకులు కరాడి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మల్లురవికి సత్కారం



మల్లురవిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధిగా మాజీ ఎంపీ డా.మల్లురవి ఆదివారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లురవిని ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డ రవీందర్‌నాయక్, మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కాసోజు రాములు కలిసి ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మల్లురవిగారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న లింగబలిజ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం: వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం వద్ద సంఘం–2024 సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సెంట్రల్ కమిటీ సభ్యుడు శెట్టి శివకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్నంశెట్టి విశ్వనాథ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మాయని ఆనందప్ప, జిల్లా అధ్యక్షుడు మిరయాణం అనిల్, జిల్లా యూత్ అధ్యక్షులు రవి, భిక్షపతి, శేఖరప్ప, హరీష్, పరమేశ్, శివ, మహేశ్, అశోక్, శిరీష్, కిషోర్, నగేష్, మధు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన ఆమనగల్లు విద్యార్థులు



ట్రోఫీతో విద్యార్థులు

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం వరల్డ్ నకయామా షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన రెండవ ఇంటర్నేషనల్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆమనగల్లు జపాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో ఆమనగల్లుకు చెందిన కరాటే విద్యార్థులు లోకేశ్, శ్రీహాన్, జగదీశ్, సాయిరిత్విక్, దేవానంద్, చిన్ను, ప్రవీన్, వంశీ, శిరీష వివిధ విభాగాల్లో 5 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. ఆయా విద్యార్థులను, కరాటే మాస్టర్ జగదీశ్వర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.